క్లుప్తంగా

కార్మికుల పిల్లలకు ఉపకారవేతనాలు

ఆత్మకూరు: కేంద్ర కార్మిక మంత్రిత్వ శాఖ అందజేసే ఉపకార వేతనాలకు కార్మికుల పిల్లలు దరఖాస్తు చేసుకోవాలని బీడీ కార్మికుల సంక్షేమ వైద్యశాల డాక్టర్ పీ పవన్ కుమార్ కోరారు. బుధవారం అయన పట్టణంలోని తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ, గుర్తింపబడిన పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు అర్హులన్నారు. ఒకటి నుంచి పదో తరగతి లోపు చదివే విద్యార్థులు ఈ నెల 30లోగా, ఐటీఐ, ఇంటర్, డిగ్రీ, ప్రొఫెషనల్ కోర్సులు చదివే వారు అక్టోబర్ 31లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 040 29561297 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

నేడు వీఏఏలకు శిక్షణ

ఉదయగిరి: ఉదయగిరి వ్యవసాయ సబ్‌డివిజన్ పరిధిలోని రైతుసేవా కేంద్రాల్లో పనిచేస్తున్న వ్యవసాయ, ఉద్యాన, సెరికల్చర్ సహాయకులకు గురువారం శిక్షణా కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఏడీ పీ చెన్నారెడ్డి బుధవారం తెలిపారు. ఉదయగిరిలో జరిగే శిక్షణా కార్యక్రమంలో నెల్లూరు కేవీకే శాస్త్రవేత్తలు పాల్గొని పలు అంశాలపై శిక్షణ ఇస్తారని చెప్పారు. ప్రతిఒక్కరూ తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.

సీఐ బాధ్యతల స్వీకరణ



ఉదయగిరి: ఉదయగిరి సీఐగా వెంకట్రావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు సీఐగా పనిచేస్తున్న గిరిబాబు గుంటూరు రేంజ్ వీఆర్‌కు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా నూతన సీఐ మాట్లాడుతూ సర్కిల్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు అధిక ప్రాధాన్యం ఇస్తామన్నారు. ప్రజలు వివాదాల జోలికి వెళ్లకుండా శాంతియుతంగా ఉండాలని కోరారు.

వాటర్‌ప్లాంట్ ప్రారంభం



చేజర్ల: ధరణి సేవా సమితి ఆధ్వర్యంలో మండలంలోని తూర్పుపల్లి పంచాయతీ పరిధిలోని రెడ్డివారికండ్రిగలో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌ను ఎంపీపీ తూమాటి విజయభాస్కర్‌రెడ్డి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ వింజమూరు ప్రాంతానికి చెందిన కేంద్ర పర్యావరణ, అటవీ మంత్రిత్వ శాఖ పారిశ్రామిక అనుమతుల కమిటీ సభ్యుడు ప్రొఫెసర్ యల్లాల వెంకటరామిరెడ్డి, ధరణి సేవా సమితి మేనేజింగ్ ట్రస్టీ యల్లాల మంజుల చొరవతో అరబిందో ఫౌండేషన్ రూ.5లక్షలతో రెండు వేల లీటర్ల కెపాసిటీ కలిగిన వాటర్‌ప్లాంట్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు బాలిరెడ్డి సుధాకర్‌రెడ్డి, తూర్పుపల్లి ఎంపీటీసీ గంగవరపు కృష్ణారెడ్డి, పలసాని సురేష్, లెక్కల రామిరెడ్డి, లెక్కల మురళి, లెక్కల మాలకొండారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఇసుక టిప్పర్ల స్వాధీనం

ఆత్మకూరు: బోయలచిరివెళ్ల సమీపంలోని బొగ్గేరు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు టిప్పర్లను నెల్లూరుపాళెం వద్ద సెబ్ అధికారులతో కలిసి బుధవారం వేకువజామున పట్టుకున్నట్లు ఎస్సై షేక్ జిలానీ తెలిపారు. కేసు నమోదు చేసి స్టేషన్‌కు తరలించినట్లు చెప్పారు.

ఆర్థిక సాయం

వింజమూరు(ఉదయగిరి): వింజమూరు మండలం గుండెమడకలకు చెందిన మహేష్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన నేపథ్యంలో కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో చిక్కుకుంది. ఈ నేపథ్యంలో మృతుడి కుటుంబ సభ్యులకు జర్నలిస్టు గడ్డం ఫకీరయ్య బుధవారం రూ.10 వేలు సాయం అందజేశారు.

వింత మేకపిల్ల జననం



సీతారామపురం: పోలంగారిపల్లిలో కటారి వెంకటయ్యకు చెందిన ఓ మేక బుధవారం వింత పిల్లకు జన్మనిచ్చింది. రెండు తలలు, నాలుగు చెవులు, 8 కాళ్లు కలిగిన మేక పిల్ల తల్లి గర్భం నుంచి బయటకు వచ్చిన కొద్దిసేపటికే మరణించింది. స్థానికులు పిల్లను వింతగా చూశారు. కొన్నిసార్లు జన్యులోపంతో ఇలాంటి పిల్లలు జన్మిస్తాయని పశువైద్య సిబ్బంది తెలిపారు.

ప్రమాదభరితంగా విద్యుత్ స్తంభం



అల్లూరు: మండలంలోని ఈస్ట్ గోగులపల్లిలో విద్యుత్ స్తంభం ప్రమాదభరితంగా ఉంది. రెండు నెలల క్రితం ట్రాక్టర్ తగలడంతో విద్యుత్ స్తంభం కింద భాగంలో విరిగింది. ఆ సమయంలో స్తంభం పడిపోకుండా స్థానికులు తాత్కాలికంగా తాళ్ల సాయంతో పక్కనే ఉన్న చెట్టుకు కట్టారు. ట్రాక్టర్ యజమాని కొత్త సంభం అందజేసిన విరిగిన దాన్ని మార్చాలని రెండు నెలలుగా విద్యుత్ అధికారులను కోరుతున్నా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాకాలంలో గాలులకు స్తంభం ఎక్కడ నేలకొరుగుతుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. స్తంభం కూలిపోయి ప్రాణనష్టం జరగకముందే విద్యుత్‌శాఖ అధికారులు స్పందించి సంభాన్ని మార్చాలని కోరుతున్నారు.

పోషకాహారంతో రక్తహీనతకు చెక్



ఉదయగిరి: అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ పద్మజాకుమారి



సీతారామపురం: సంజీవరెడ్డినగర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు



ఆత్మకూరు: పోషకాహారంపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ అస్మా



సంగంలో ..



అల్లూరులో..

వింజమూరు (ఉదయగిరి): గర్భిణులు, బాలింతలు పోషకాహారాన్ని తీసుకోవడం ద్వారా రక్తహీనతను అధిగమించవచ్చని ఐసీడీఎస్ సీడీపీఓ పద్మజాకుమారి తెలిపారు. వింజమూరు మండలం జీబీకేఆర్ ఎస్టీ కాలనీ, ఏసీనగర్ అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషకాహార మాసోత్సవాలను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎక్కువ పోషకాలు ఉండే తక్కువ ఖర్చుతో లభ్యమయ్యే ఆహార పదార్థాలను ఎక్కువగా తీసుకోవాలని సూచించారు. పిల్లల ఎదుగుదల వారికి అందించే ఆహారంపైనే ఆధారపడి ఉంటుందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందజేసే పౌష్టికాహారంతో పాటు చిరుధాన్యాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆత్మకూరు: పట్టణంలోని వందూరుగుంట అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ సీడీపీఓ సునీలత ఆధ్వర్యంలో పోషకాహార మాసోత్సవాలను నిర్వహించారు. ఆత్మకూరు పీహెచ్‌సీ డాక్టర్ షేక్ అస్మా పాల్గొని పోషకాహారంపై అవగాహన కల్పించారు. అనంతరం చిన్నారులకు వైద్య పరీక్షలు చేశారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రత్నమ్మ, అంగన్‌వాడీలు రమణమ్మ, చెంచులక్ష్మి, అరుణ, చెంచమ్మ, షేక్ మహ్మదున్నీసా, వార్డు కౌన్సిలర్ గంధళ్ల వేణు, హెల్త్‌సూపర్‌వైజర్ సుధాకర్, ఆశాకార్యకర్త సుజాత, తదితరులు పాల్గొన్నారు.

సంగం: స్థానిక రాళ్లచెలికలోని మిక్సెడ్‌కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మావతి ఆధ్వర్యంలో పోషకాహార మాసోత్సవాలను నిర్వహించారు. ఆత్మకూరు సీడీపీఓ సునీలత పాల్గొని పౌష్టికాహారంపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. అనంతరం గర్భిణులకు పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు.

అల్లూరు: స్థానిక అంజినాయుడు కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన పోషకాహార మాసోత్సవాల్లో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఏ రాజేశ్వరి పాల్గొన్నారు. గర్భిణులు, బాలింతల చిరుధాన్యాలను ఆహారంగా తీసుకోవడం ద్వారా రక్తహీనతను అధిగమించవచ్చని తెలిపారు. ఆశాకార్యకర్తలు లలితమ్మ, ప్రసూన, రాధ పాల్గొన్నారు.

సీతారామపురం: మండలంలోని సంజీవరెడ్డినగర్ అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహార మాసోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు ఉండే ఆకుకూరలు, సమతుల ఆహారాన్ని గర్భిణులు, బాలింతలు తీసుకోవాలని సూచించారు. అనంతరం గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం సంజీవరావు, అంగన్‌వాడీలు టీవీ మహాలక్ష్మిదేవి, అరుణ, తదితరులు పాల్గొన్నారు.

గిరిజన ఉద్యోగిని బలిచేయడం తగదు

కావలి: కావలి తహసీల్దార్ కార్యాలయంలో ఆఫీసు సబార్డినేట్‌గా పనిచేస్తున్న గిరిజన ఉద్యోగి చలంచర్ల సాయిబాబా ఉద్యోగ విరమణ విషయంలో అధికారులు తప్పులు చేశారని, దానిని నుంచి తప్పించుకునేందుకు ఆయన్నే బలి చేసేందుకు యత్నిస్తున్నారని, దీనిపై సమగ్ర విచారణ జరిపి న్యాయం చేయకపోతే ఈ నెల 9 నుంచి కావలి ఆర్డీఓ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతామని యానాదుల సంక్షేమ సంఘం రాష్ట్రాధ్యక్షుడు కేసీ పెంచలయ్య హెచ్చరించారు. పట్టణంలోని జర్నలిస్టు క్లబ్‌లో బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో సాయిబాబాతో కలిసి ఆయన మాట్లాడారు. ఉద్యోగికి సంబంధించిన సర్వీస్ రిజిస్టర్ ఎస్టాబ్లిష్మెంట్ క్లర్క్ ఆధీనంలో ఉంటుందని, అలాంటప్పుడు ఇతరులు దిద్దేందుకు అవకాశం ఎలా ఉంటుందని? డ్రాయింగ్ ఆఫీసర్ జీతాల బిల్లు ఎలా పెట్టాడని? ప్రశ్నించారు. వీరిపై చర్యలు తీసుకోకుండా గిరిజన ఉద్యోగిపైనే కేసు పెట్టడం ఏమిటని నిలదీశారు. సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కావలి మున్సిపల్ మాజీ చైర్మన్ చలంచర్ల దేవసేన, యానాదుల సంక్షేమ సంఘ జిల్లా అధ్యక్షుడు మానికల మురళి, ప్రధాన కార్యదర్శి మాకాని రవీంద్రబాబు, మహిళా అధ్యక్షురాలు చెంబేటి ఉష, సతీష్ చంద్ర పాల్గొన్నారు.

యథేచ్ఛగా చెరువు మట్టి తరలింపు

ఆత్మకూరు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తెలుగు తమ్ముళ్లు ప్రకృతి వనరులను కొల్లగొడుతున్నారు. యథేచ్ఛగా మట్టి, ఇసుక, గ్రావెల్‌ను అక్రమంగా తరలించి లక్షలాది రూపాయలు జేబుల్లో నింపుకొంటున్నారు. ఆత్మకూరు మేజర్ చెరువును సైతం తమ్ముళ్లు వదలడంలేదు. అల్లీపురం వద్ద చెరువు లోపల జేసీబీని ఏర్పాటు చేసి ట్రాక్టర్ల ద్వారా మట్టిని అక్రమంగా ఇటుక బట్టీలకు తరలిస్తున్నారు. వైఎస్సార్ జగనన్న కాలనీ సమీపంలోని మున్సిపల్ మాజీ కౌన్సిలర్‌కు సంబంధించి బట్టీలను టీడీపీకి చెందిన ఓ వ్యక్తి లీజుకు తీసుకుని ఇటుకల తయారీకి సిద్ధమయ్యాడు. ఈ క్రమంలో ఆత్మకూరు చెరువులోని వందల ట్రక్కుల మట్టిని బట్టీలకు తరలించేందుకు ప్రణాళిక రూపొందించుకున్నాడు. మంగళవారం రాత్రి అల్లీపురం వద్ద చెరువులో జేసీబీని ఏర్పాటు చేసి ట్రాక్టర్ల ద్వారా అటవీ మార్గంలో బట్టీల వద్దకు తరలించాడు. అర్ధరాత్రి వర్షం రావడంతో కొంత మేర తోలి నిలిపివేశాడు. చెరువు మట్టి తరలింపునకు అనుమతులు తీసుకోవాల్సి ఉన్నా ప్రభుత్వం తమదేననే ధైర్యంతో మట్టి తోలకాలు యథేచ్ఛగా సాగిస్తున్నారు. అయినా సంబంధిత అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు.



ఇటుక బట్టీల కోసం డంప్ చేసిన మట్టి

ఉచితంగా పర్యావరణహిత మట్టి గణపతుల పంపిణీ



కావలి: వినాయక చవితిని పురస్కరించుకుని పర్యావరణహిత మట్టి వినాయక ప్రతిమలను ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు జనసేన పార్టీ కావలి నియోజకవర్గ ఇన్‌చార్జి అళహరి సుధాకర్ తెలిపారు. పట్టణంలోని జనసేన పార్టీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం ఆయన మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఆక్సిజన్‌ను విడుదల చేసే మొక్కల విత్తనాలను మట్టి గణపతి ప్రతిమల్లో ఉంచుతున్నామని తెలిపారు. వీటిని నీటిలో కాకుండా భూమిలో నిమజ్జనం చేస్తే మొలకెత్తుతాయని వివరించారు. కావలి ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పంటల సాగులో మెలకువలు పాటించాలి

మర్రిపాడు: పంటల సాగులో రైతులు మెలకువలు పాటించాలని ఆత్మ పీడీ శివన్నారాయణ సూచించారు. మండలంలోని పొంగూరుకండ్రిగ, పడమటి నాయుడుపల్లి, కదిరినాయుడుపల్లి గ్రామాల్లో మండల వ్యవసాయాధికారి ఎస్ రామ్మోహన్ ఆధ్వర్యంలో ఆత్మ పీడీ శివన్నారాయణ, కేవీకే శాస్త్రవేత్తల బృందం బుధవారం పర్యటించింది. ఆయా గ్రామాల్లో సాగుచేసిన పంటలను పరిశీలించి రైతులకు సూచనలు చేశారు. మొక్కజొన్న పంటలో కత్తెర పురుగును గమనించి నివారణకు ఎకరాకు ఎమామెక్టిన్ బెంజోయేట్ 100 గ్రాములను పిచికారీ చేయాలని సూచించారు. కలుపు నివారణకు మొక్కజొన్న విత్తిన 20 నుంచి 25 రోజులకు టెంబోట్రియాన్ 115 మి.లీ. ఎకరాకు పిచికారీ చేయాలని తెలిపారు. రబీలో జొన్న సాగు చేసే రైతులు నంద్యాల తెల్లజొన్న-5, ఎన్-15 రకాలను వేసుకోవాలని సూచించారు. అనంతరం కేవీకే అందజేసిన ఎల్‌సీఏ 643, ఎల్‌సీఏ 657 రకం మిరప విత్తనాల నారుమడులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ విజయ్‌కుమార్‌నాయక్, వీఏఏలు ప్రశాంతి, తదితరులు పాల్గొన్నారు.



మొక్కజొన్నను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

చవితి ఉత్సవాలకు అనుమతులు తప్పనిసరి

సంగం/ఉదయగిరి/ జలదంకి: వినాయక చవితి ఉత్సవాల నిర్వాహకులు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని సంగం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వేమారెడ్డి, ఉదయగిరి, జలదంకి ఎస్సైలు కర్నాటి ఇంద్రసేనారెడ్డి, లతీఫున్నీసా తెలిపారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడారు. ఉత్సవాలకు ఆన్‌లైన్ ద్వారా సింగిల్ విండో విధానంలో అనుమతులు మంజూరు చేస్తున్నామని చెప్పారు. విగ్రహాల ఊరేగింపు సందర్భంగా మైక్‌లు, డీజేలు ఏర్పాటు చేసేవారు చలానా కట్టి ముందస్తు అనుమతులు తీసుకోవాలన్నారు. ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు. అవాంఛనీయ ఘటనలు జరిగితే ఉత్సవ కమిటీలు బాధ్యత వహించాల్సి వస్తుందని హెచ్చరించారు.

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపిక



పెట్లూరి కల్పన, విజయకుమారి, తిరుపాలు, మహేంద్ర, శివరామిరెడ్డి, బీ వెంకటేశ్వర్లు



అజాజ్

వింజమూరు(ఉదయగిరి): ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా జిల్లా వ్యాప్తంగా పలువురు ఉపాధ్యాయులను ఉత్తమ ఉపాధ్యాయులుగా ప్రభుత్వం ప్రకటించింది. వింజమూరు మండలానికి చెందిన పెట్లూరి కల్పన (వింజమూరు బీసీ కాలనీ), పీ విజయకుమారి (ఆర్కేహెచ్‌ఎస్, చాకలికొండ), కే తిరుపాలు, సీహెచ్ మహేంద్ర (వింజమూరు బాలుర ఉన్నత పాఠశాల) ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా వారికి సహచర ఉపాధ్యాయులతో పాటు ఉపాధ్యాయ సంఘాల నాయకులు అభినందనలు తెలిపారు

ఆత్మకూరురూరల్: మండలంలోని మహిమలూరు పాఠశాలలో పనిచేస్తున్న బండారు వెంకటేశ్వర్లు, నల్లపరెడ్డిపల్లి పాఠశాలలో పనిచేస్తున్న వైజీ శివరామిరెడ్డి, చెర్లోయడవల్లి పాఠశాలలో పనిచేస్తున్న ఎండీ అజాజ్ ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. వారికి పలువురు ఉపాధ్యాయ సంఘాల వారు శుభాకాంక్షలు తెలిపారు.

ఆత్మకూరు: మున్సిపల్ పరిధిలోని పాఠశాలల్లో పనిచేస్తున్న జీ హజరత్తయ్య(ఏసీఎస్ఆర్‌కాలనీ పాఠశాల), సీహెచ్ మాలకొండమ్మ, కే నాగేంద్రరావు(ఎంపీపీ పాఠశాల), మనోరమ (శాంతినగర్), ఎం ప్రసాద్(ప్రభుత్వ ఉన్నత పాఠశాల), గంగాధరం(ఎంపీపీఎస్ వెస్ట్), కే స్నేహకుమార్ (ఎంపీపీఎస్ ఈస్ట్), ఏ అనురాధ(ఎల్ఆర్‌పల్లి ఎంపీపీఎస్) ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు.

సీతారామపురం: మండల ఉత్తమ ఉపాధ్యాయులుగా ఐదుగురు ఎంపికైనట్లు ఎంఈఓ మస్తాన్‌వలి బుధవారం తెలిపారు. షేక్ అంజాద్‌బాషా (సీతారామపురం జెడ్పీహెచ్‌ఎస్), బాలిరెడ్డి (పండ్రంగి ఎంపీపీఎస్), మహేష్ (పబ్బులేటిపల్లి ఎంపీపీఎస్), వెంకటేశ్వర్లు (గంగవరం ఎంపీపీఎస్), ఎస్‌కేఎం జరీనాబేగం (రంగనాయుడుపల్లి ఎంపీపీఎస్ ఉర్దూ) ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికి చేసినట్లు చెప్పారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మాన కార్యక్రమం నిర్వహిస్తున్నందున ఎంపికైన వారు హాజరు కావాలని కోరారు.

అంధ విద్యార్థినికి బ్రెయిలీ కిట్



వరికుంటపాడు: మండలంలోని కృష్ణగాం. దీపురం ప్రాథమిక పాఠశాల్లో చదువుతున్న రాచపూడి సంజన అనే అంధ విద్యార్థినికి ఆర్టిఫిషియల్ మ్యానుఫ్యాక్చరింగ్ కార్పొరేషన్ సహాయంతో బ్రెయిలీ కిట్‌ను ఎంఈఓలు షావుద్దీన్, రమణయ్య బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంజన పూర్తిగా అంధురాలు కావడంతో విద్యను అభ్యసించడానికి బ్రెయిలీ కిట్‌ను అందజేసినట్లు తెలిపారు. ప్రత్యేక ఉపాధ్యాయులు మనోహర్, చంద్రమౌళి పాల్గొన్నారు.

15వ ఆర్థిక సంఘం నిధుల విడుదల

వరికుంటపాడు: మండలంలోని 24 గ్రామ పంచాయతీలకు జనాభా ప్రతిపదికన 15వ ఆర్థిక సంఘం రెండో విడత నిధులు మంజూరైనట్లు ఎంపీడీఓ మల్లికార్జున బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. డక్కునూరుకు రూ.70,585, గణేశ్వరాపురం రూ.1,72,562, గువ్వాడి రూ.92,837, ఇస్కపల్లి రూ.51686, జడదేవి రూ.1,19,293, కాంచెరువు రూ.86,399, జీ కొండారెడ్డిపల్లి రూ.1,49,847, టీ కొండారెడ్డిపల్లి రూ.80,105, మహమ్మదాపురం రూ.1,25,807, నల్లబోతులవారిపల్లి రూ.65,621, నార్తుకొండాయపాళెం రూ.1,48,257,నార్తుకృష్ణంరాజుపల్లి రూ.95,158, పామూరుపల్లి రూ.57,130, పెద్దిరెడ్డిపల్లి రూ.1,94,648, రామాపురం రూ.1,84,405, తిమ్మారెడ్డిపల్లి రూ.1,17,604, తూర్పుబోయమడుగుల రూ.1,09,876, తూర్పు చెన్నంపల్లి రూ.54,22, తూర్పురొంపిదొడ్ల రూ.1,40,547, తోటలచెరువుపల్లి రూ.1,62,025, వరికుంటపాడు రూ.3,74,275, వేంపాడు రూ.1,88,369, విరువూరుకు రూ.1,72,440 వంతున మంజూరైనట్లు వివరించారు. తాగునీరు, పారిశుధ్యం, వీధిదీపాలు, రోడ్ల నిర్మాణం, తదితరాలకు నిధులను ఖర్చు చేయాల్సి ఉంటుందని తెలిపారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

ఉదయగిరి: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని మేకపాటి గౌతమ్‌రెడ్డి వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ జే కృష్ణారెడ్డి అన్నారు. స్థానిక వ్యవసాయ కళాశాలలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలే మానవ మనుగడకు ఆధారమన్నారు. ప్రతివిద్యార్థి ఒక మొక్క నాటి దానిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సంగం: పర్యావరణ పరిరక్షణలో భాగంగా స్థానిక బాలికల గురుకు పాఠశాలకు సంగానికి చెందిన వేమా మల్లికార్జునరావు 30 రకాల మొక్కలను బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ సుమతి విద్యార్థినుల కోసం బెంచీలు వితరణ చేయాలని విజ్ఞప్తి చేయగా త్వరలో చేస్తామని హామీ ఇచ్చారు.



ఉదయగిరి: మొక్కలు నాటుతున్న అధ్యాపకులు

వర్షాకాలంలో అప్రమత్తంగా ఉండాలి

సంగం: వర్షాకాలంలో వరద ప్రభావిత ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సంగం సీఐ వేమారెడ్డి సూచించారు. మండలంలోని వీర్లగుడిపాడులో బుధవారం ఆయన పర్యటించారు. పెన్నానది తీరప్రాంత గ్రామమైనందున వర్షాకాలంలో జాగ్రత్తగా ఉండాలన్నారు. వరదలు వచ్చినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.



మాట్లాడుతున్న సీఐ వేమారెడ్డి

విద్యార్థులకు కంటి పరీక్షలు

చేజర్ల: ఆదూరుపల్లిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలోని విద్యార్థినులకు చిత్తలూరు పీహెచ్‌సీ వైద్యులు ఏ నవీన్‌కుమార్‌రెడ్డి గురువారం కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ కంటి సమస్యలపై అవగాహన కల్పించారు. కంటి సమస్యలు తలెత్తకుండా ఆకు కూరలు, పండ్లు, గుడ్లు, పాలు ఎక్కువగా తీసుకోవాలని సూచించారు. ప్రిన్సిపాల్ శైలజాకుమారి, వైస్ ప్రిన్సిపాల్ నాగలలిత పాల్గొన్నారు.

మోటార్‌సైకిళ్లు ఢీ–ఒకరు మృతి

మరో ఇద్దరికి తీవ్రగాయాలు



సుధాకర్ మృతదేహం

కలిగిరి: కలిగిరిలోని పొగాకు వేలం కేంద్రం సమీపంలో నెల్లూరు రోడ్డుపై ఎదురెదురుగా బుధవారం రాత్రి రెండు మోటార్ సైకిళ్లు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఒకరు మృత్యువాత పడగా, మరో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల వివరాల మేరకు..నెల్లూరు రూరల్ మండలం వెల్లంటికి చెందిన పాదర్తి సుధాకర్ (40) కలిగిరి మండలం కృష్ణారెడ్డిపాళెంలోని బంధువుల ఇంటికి వచ్చాడు. తిరిగి స్వగ్రామానికి మోటార్‌సైకిల్‌పై బయలుదేరాడు. వెలగపాడుకు చెందిన దర్గాబాబు, రవీంద్ర అనే యువకులు మోటార్ సైకిల్‌పై కలిగిరికి వస్తున్నారు. పొగాకు వేలం కేంద్రం సమీపంలో రెండు మోటార్ సైకిళ్లు అదుపుతప్పి ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో సుధాకర్ తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. దర్గాబాబు, రవీంద్రకు తీవ్రగాయాలవగా 108 వాహన సిబ్బంది కలిగిరిలో ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. ఏఎస్సై సుబ్బారావు ఘటనా స్థలాన్ని పరిశీలించారు.